క్లుప్తంగా

7న చెన్నూర్ బంద్

చెన్నూర్: జమ్మూ కశ్మీర్ పహల్గాంలో హిందూ పర్యాటకులపై జిహాది ముస్లిం తీవ్రవాదుల దాడిని ఖండిస్తూ ఈ నెల 7న బుధవారం హిందూ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో చెన్నూర్ పట్టణ బంద్ నిర్వహిస్తున్నట్లు హిందు సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు నడిపల్లి లక్ష్మణ్‌రావు తెలిపారు. బంద్‌లో వ్యాపార, వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాలని తెలిపారు. బంద్ సందర్భంగా హిందూ ఐక్య సంఘాల ఆధ్వర్యంలో ఉదయం 9గంటలకు కొత్త బస్టాండ్ నుంచి గాంధీ చౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా నిర్వహించే ర్యాలీలో హిందువులంతా పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సీసీసీ నస్పూర్ ఎస్‌హెచ్‌వోగా ఉపేందర్‌రావు


బాధ్యతలు స్వీకరిస్తున్న ఉపేందర్‌రావు

నస్పూర్: సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా యూ.ఉపేందర్‌రావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. రామగుండం కమిషనరేట్ పరిధిలోని టాస్క్‌ఫోర్స్‌లో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న ఆయన, బదిలీపై ఇక్కడకు వచ్చారు. కాగా ఇక్కడ ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వర్తించిన సుగుణాకర్ ఓ కేసు విషయంలో గత కొద్ది రోజుల క్రితం ఏసీబీకి చిక్కి సస్పెన్షన్‌కు గురైన విషయం తెలిసిందే.

గెర్రె కాలనీలో మేడే ఉత్సవాలు


జెండా ఎగురవేస్తున్న మహిళలు

చెన్నూర్: పట్టణంలోని గెర్రెకాలనీలో సీపీఎం ఆధ్వర్యంలో మేడే వారోత్సవాల సందర్భంగా ఆదివారం సీపీఎం జెండాను ఎగురవేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రవి మాట్లాడుతూ.. సీపీఎం పోరాటంతో మహిళల హక్కులను సాధించినట్లు తెలిపారు. సీపీఎం నాయకులు చందు, రంజిత్‌కుమార్, ఉమరాణి, సరిత, నగేశ్, రమాదేవి పాల్గొన్నారు.

'పల్లెబాట' పోస్టర్ ఆవిష్కరణ


పాతమంచిర్యాల: బీసీల హక్కులు, కులగణన సాధన కోసం 12ఏళ్లుగా పోరాడి కులగణన సాధించిన సందర్భంగా గ్రామగ్రామాన, బీసీలను జాగృత పర్చడం కోసం (ఈ నెల 05) సోమవారం నుంచి నిర్వహించే బీసీల మేలుకొలుపు యాత్ర (పల్లెబాట) కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి నుంచి ప్రారంభమవుతుందని బీసీ ఆజాది ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో నాయకులతో కలిసి ఆదివారం 'పల్లెబాట' పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశానికి బీసీలు, కవులు, కళాకారులు, మేధావులు, బీసీ సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

వందనకు ఏఈ ఉద్యోగం


మంత్రి శ్రీనివాస్ చేతుల మీదుగా నియామకపత్రం అందుకుంటున్న వందన

తాండూర్: తాండూర్ మండలానికి చెందిన ఓ యువతి గృహ నిర్మాణశాఖలో ఏఈగా ఉద్యోగం సాధించింది. ఈ మేరకు తాజాగా రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. దుర్గం కమల-లక్ష్మీ నారాయణ కుమార్తె దుర్గం వందన సివిల్‌ఇంజనీర్ చదివింది. గతంలో ఏఈఈ ఉద్యోగం తృటిలో చేజారడంతో, పట్టుదలతో చదివి ఏఈ ఉద్యోగం సంపాదించింది. ప్రస్తుతం ఆమెకు ఆసిఫాబాద్ కుమురం భీం జిల్లాలో పోస్టింగ్ ఇచ్చారు. ఉద్యోగం సాధించిన వందనను పలువురు అభినందించారు.

'మంజూరైన పనులకే మళ్లీ శంకుస్థాపనలు'


మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే మంజూరు చేసిన పనులకు తిరిగి ఆదివారం రోజున స్థానిక ఎమ్మెల్యే, జిల్లా అధికారులు కలిసి మరోసారి శంకుస్థాపనలు చేశారని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. ఐబీ చౌరస్తా నుంచి క్యాతన్‌పల్లి వరకు రూ.35కోట్లతో రోడ్డు వెడల్పు, కల్వర్టుల నిర్మాణం కోసం నిధులను 2023 సెప్టెంబర్ 1న ప్రభుత్వం జీవో విడుదల చేయగా, అప్పటి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేతతో కలిసి, తాను రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశానన్నారు. ఇప్పుడు అదే రోడ్డుకు మరోసారి శంకుస్థాపన చేయడం ఏంటో ప్రజలకు వివరించాలని తెలిపారు.

కంపు కొడుతున్న ఎంసీహెచ్


ఎంసీహెచ్ భవనం పక్కనే పడేసిన బయోవేస్టేజ్



కిటికీల వద్ద బయోవేస్టేజ్ కుప్పలు


ఆపరేషన్ సమయంలో వినియోగించిన గ్లౌజ్‌లు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం చుట్టూ బయోవేస్టేజ్‌ను ఇష్టారీతిన పడేయడంతో కంపుకొడుతోంది. వివిధ వైద్య పరీక్షలకు వినియోగించిన మెడికల్ కిట్లు, ఇంజక్షన్లు, రక్తస్రావం కాకుండా ఉంచిన కాటన్, ఆపరేషన్ అనంతరం రక్తంతో తడిసిన వస్తువులను బయోవేస్టేజ్ కింద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గదిలో వేసి ఉంచాలి. కానీ ఆసుపత్రి భవనం చుట్టూ పడేయడంతో దుర్వాసనతో పాటు, ఆసుపత్రికి వచ్చే వారికి ప్రమాదకరంగా మారుతోంది. ప్రతీరోజు ఎంసీహెచ్‌కు 150మందికి పైగా గర్భిణులు వైద్య పరీక్షలు, స్కానింగ్ కోసం వస్తుండగా, నిత్యం వార్డుల్లో వంద మందికి పైగానే ప్రసవం పొందిన బాలింతలు, చిన్నారులు ఉంటున్నారు. చిన్నారులకు, గర్భిణులకు పరిసరాల అపరిశుభ్రత వల్ల ఏవైనా వ్యాధులు త్వరగా సోకే ప్రమాదం ఉందని తెలిసినా, వైద్యాధికారులు నిర్లక్ష్యం వహించడంపై పలువురు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకొని పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరుతున్నారు.

పార్టీ కోసం కష్టపడే వారికే పదవులు

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్

బెల్లంపల్లి: కాంగ్రెస్‌పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు సంస్థాగత పదవుల్లో సముచిత స్థానం కల్పించనున్నట్లు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, టీపీసీసీ పరిశీలకుడు జంగరాఘవ రెడ్డి అన్నారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో ఆదివారం అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ సంస్థాగత ఎన్నికల నిర్మాణ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొని వారు మాట్లాడారు. పార్టీ మారకుండా గత పదిహేనేళ్ల నుంచి పనిచేస్తున్న శ్రేణులు దరఖాస్తులు అందజేయాలన్నారు. అలాంటి వారికే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సూచించిన మాదిరిగా పదవులు దక్కుతాయన్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సామాజిక న్యాయం పాటించనున్నట్లు వివరించారు. ప్రతీ కార్యకర్త చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు.


రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే వినోద్, నాయకులు

అంతకు ముందు బీసీ కులగణన దేశ వ్యాప్తంగా చేపట్టాలని పిలుపునిచ్చిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, రాష్ట్రంలో బీసీ కులగణన నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే వినోద్ క్షీరాభిషేకం చేశారు. సమావేశంలో టీపీసీసీ సభ్యులు రాంభూపాల్, చిలుముల శంకర్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎం.సూరిబాబు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కారుకూరి రాంచందర్, బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, ముఖ్య నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో ముందుండాలి

- కలెక్టర్ కుమార్‌దీపక్

శ్రీరాంపూర్: జర్నలిస్టులు వార్తలు రాయడమే కాకుండా సామాజిక సేవ కార్యక్రమాల్లో కూడా ముందుండాలని కలెక్టర్ కుమార్‌దీపక్ తెలిపారు. నస్పూర్ కాలనీలోని నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం రెనే హాస్పిటల్, మెడ్‌లైఫ్ వారి సౌజన్యంతో ఉచిత మెగా సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించి అనంతరం వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక బాధ్యతగా సింగరేణి ప్రాంత జర్నలిస్టులు ఉచిత వైద్య శిబిరాన్ని ఇక్కడ ఏర్పాటు చేసి అనేక మందికి వ్యాధి నిర్ధారణ పరీక్ష చేసి మందులు ఇప్పించడం అభినందనీయం అన్నారు. ప్రాథమిక దశలో వ్యాధి నిర్ధారణ జరిగితే మున్ముందు జబ్బులు ముదురకుండా జాగ్రత్త పడవచ్చన్నారు. ఈ కార్యక్రమానికి శ్రీరాంపూర్ ఏరియా ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై ఈసీజీ, 2డీ ఎకో పరీక్ష కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం రెనే హాస్పిటల్ చైర్మన్ బంగారు స్వామి, మెడ్‌లైఫ్ హాస్పిటల్ వైద్యులు కొటం కుమారస్వామి మాట్లాడుతూ.. ఇక్కడ ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పెద్దయెత్తున ప్రజలు హాజరై క్యాంపును సద్వినియోగం చేసుకోవడం సంతోషకరమన్నారు. సుమారు 1200మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, సింగరణి సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, రెనే హాస్పిటల్ జనరల్ మేనేజర్ పవన్ ప్రసాద్, నాన్ సర్జికల్ డైరెక్టర్ అరవింద రావు, శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు భూపతి రవి, సభ్యులు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

చెన్నూర్‌రూరల్: ఎలాంటి అవకతవకలు లేకుండా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు చెన్నూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వివేక్ అన్నారు. మండలంలోని ఒతుకులపల్లిలో రూ.3కోట్ల 55లక్షలతో బీటీ రోడ్డు, వంతెన నిర్మాణం, దుబ్బపల్లిలో రూ.3కోట్లతో జెడ్పీ రోడ్డుకు ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వివేక్

'ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపై అపోహలు వద్దు'

చెన్నూర్: ప్రజలు ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపై అనవసరపు అపోహలు వద్దని, అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఎంపీడీవోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ, సింగరేణి ఉద్యోగులకు, గతంలో లబ్ధిపొందిన వారికి మరోసారి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయమని స్పష్టం చేశారు. ప్రభుత్వం అర్హులైన ప్రతి పేదకు సొంతింటి కల సాకారం చేసేందుకు కంకణం కట్టుకుందన్నారు. ఇళ్ల మంజూరు కోసం పైరవీలకు తావుండదన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో, ఎంపీడీవో మోహన్, మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి పుష్పాభిషేకం

పాతమంచిర్యాల: కులగణనతో దేశంలో సమానత్వం, సమగ్ర అభివృద్ధి జరుగుతుందని బీసీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఒడ్డేపల్లి మనోహర్, బీసీ ఆజాది ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు జక్కని సంజయ్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం కులగణనకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ భారత ప్రధాని నరేంద్రమోదీ, జ్యోతిభాపూలే, బీపీ మండల్ సాహు మహారాజ్‌ల చిత్రపటాలకు పుష్పాభిషేకం చేశారు. కార్యక్రమంలో రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గాడ్గె కుమార్, బీజేపీ నాయకులు తులా మధుసూధన్, మున్నారాజా సిసోడియా, ప్రభాకర్, బీసీ మహిళా జేఏసీ జిల్లా కన్వీనర్ పేరం అలేఖ్య, కో కన్వీనర్ కలికోట కవిత, నాయకులు గజెల్లి వెంకటయ్య, కొట్టె నటేశ్వర్, లతీఫ్, చంద్రకాంత్, విద్యార్థి నాయకులు వంశీ పాల్గొన్నారు.


పుష్పాభిషేకం చేస్తున్న నాయకులు

'దళిత యువకుడిపై దాడి సిగ్గుచేటు'

బెల్లంపల్లి: సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం వేచరేణి గ్రామంలో మతిస్థిమితం లేని ఓ దళిత యువకుడి ఊపిరి అజయ్‌ని దారుణంగా కొట్టి నగ్నంగా ఊరేగించిన నింధితులపై చర్యలు తీసుకోవాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిలుక రాజనర్సు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోళ్ల రమేష్, సీనియర్ నాయకులు కుక్నపల్లి నారాయణ, రాజలింగు, రాజ్‌కుమార్, ప్రసాద్, నవీన్, శేఖర్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాజనర్సు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మందమర్రిరూరల్: బెల్లంపల్లి సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగా సోమవారం ఉదయం 8-30 నుంచి 9-30వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఇంజనీర్ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మందమర్రి పట్టణంలోని జీఎం ఆఫీస్ ఏరియా, యాపల్, కేకే-2 ఏరియా, ఊరుమందమర్రి, టోల్‌ప్లాజా ఏరియా, మార్కెట్, దీపక్‌నగర్, పాలచెట్టు ఏరియా, దొరలబంగ్లాస్, ఊరురామకృష్ణాపూర్, కాశీనగర్, పులిమడుగు, అందుగులపేట, కోటేశ్వరరావుపల్లె, బొక్కలగుట్ట, నార్లాపూర్, అందుగులపేట్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

'హరేకృష్ణ సంకీర్తనతో ఇస్కాన్‌కు సంబంధం లేదు'

భీమారం: మండల కేంద్రంలోని ఓ రియల్ ఎస్టేట్ వెంచర్‌లో శ్రీకృష్ణబలరాం మందిరం నిర్మాణం పేరుతో ప్రకటనలు ఇస్తున్న హరేకృష్ణ సంకీర్తన సంస్థతో ఇస్కాన్‌కు ఎలాంటి సంబంధం లేదని ఇస్కాన్ బెంగళూర్, హైదరాబాద్‌లోని హరేకృష్ణ మూమెంట్ ప్రతినిధులు తెలిపారు. శ్రీ పాణచైతన్య దాస అనే వ్యక్తి ఇస్కాన్ బెంగళూర్‌కి చెందినవాడినని ఈ మేరకు తాను హరేకృష్ణ సంకీర్తన మూమెంట్ అనే సంస్థను స్థాపించానని చెప్పుకుంటున్నాడని వారు తెలిపారు. కాగా భీమారంలోని రియల్ ఎస్టేట్ వెంచర్‌లో ఐదెకరాల భూమిని శ్రీకృష్ణబలరాం మందిరం నిర్మాణం కోసం తమకు ఇచ్చినట్లు చెప్పుకుంటున్నారన్నారు. శ్రీపాణచైతన్య దాస ఇస్కాన్ బెంగళూర్ సభ్యుడు కాదని, ఆ సంస్థకి ఇస్కాన్‌తో ఎలాంటి సంబంధం లేదని వారు తెలిపారు. అతడికి ఇస్కాన్ పేరుతో ఎలాంటి విరాళాలు ఇవ్వవద్దని ప్రజలను కోరారు. తెలంగాణాలో ఇస్కాన్ బెంగళూర్ ద్వారా హరేకృష్ణ మూమెంట్ హైదరాబాద్ మాత్రమే అధికారికంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సంస్థ పేరు చెప్పి ప్రజలను మోసం చేస్తే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బర్త్‌రూట్స్ ఆసుపత్రి ప్రారంభం

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో నూతనంగా నిర్మించిన బర్త్‌రూట్స్ ఆసుపత్రిని ఆదివారం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, కలెక్టర్ కుమార్‌దీపక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బర్త్‌రూట్స్ ఆసుపత్రి ఎం.డి.కృష్ణ గోలి మాట్లాడుతూ.. డాక్టర్ గోలి శృతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తమ ఆసుపత్రిలో సహజ ప్రసవాలతో పాటు, సంతానం లేని దంపతుల కోసం ఐవీఎఫ్ చికిత్స, ల్యాప్రోస్కోపి సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి టీఎంసీ సభ్యులు డాక్టర్ ఎగ్గన శ్రీనివాస్, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రమణ, చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ ఎన్.మల్లేశ్, కెమిస్టు, డ్రగ్గిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మోటూరు చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షులు తొగరు సుధాకర్, ఎ.వెంకటేశ్, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త వెంకటేశ్వర్లు, మంచిర్యాల అధ్యక్షుడు కొత్త రాజేశం, రాష్ట్ర నాయకులు ముక్త శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ మాదంశెట్టి సంజీవ్, జగ్గారి సంజీవ్, నాగిశెట్టి జ్యోతి, గీతామందిర్ నిర్వాహకులు మౌనస్వామి, గీతా అధ్యయన మండలి నిర్వాహకులు డాక్టర్ కృష్ణారెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు గుండ సుధాకర్ పాల్గొన్నారు.


ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, కలెక్టర్ కుమార్‌దీపక్

'ఆపరేషన్ కగార్' నిలిపివేయాలి

మందమర్రిరూరల్: కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను ఏరిపారేస్తుందని, కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని సీపీఐ రాష్ట్ర కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ డిమాండ్ చేశారు. స్థానిక సీఈఆర్ క్లబ్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన సీపీఐ జిల్లాస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీపీఐ పార్టీ మండల, జిల్లా, రాష్ట్రస్థాయి మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 21-25 వరకు చండీఘడ్‌లో జాతీయ మహాసభలు ఉంటాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. సీపీఐ జిల్లా సమితి సభ్యులు సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రామడుగు లక్ష్మణ్, రాష్ట్రసమితి సభ్యులు మేకల దాసు, మిట్టపల్లి వెంకటస్వామి, జోగుల మల్లయ్య, పట్టణ అధ్యక్షుడు కామెర దుర్గరాజ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలవేన శంకర్

అ'పూర్వ' సమ్మేళనం



భీమారం: వారంతా బాల్యమిత్రులు. ఒకేచోట కలిసి చదువుకున్నారు. భీమారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005-2006లో పదో తరగతి పూర్తయ్యాక ఎవరిదారిలో వారెళ్లారు. కొందరు ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు చేస్తుండగా, మరికొందరు వ్యాపారాల్లో స్థిరపడ్డారు. ఎక్కడో స్థిరపడిన వారంతా ఇరువై ఏళ్ల తర్వాత ఆదివారం ఆ పాఠశాల ఆవరణలో ఒక్కచోట కలిశారు. తమతమ జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ సందడిగా గడిపారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆనాడు విద్యాబోధన చేసిన గురువులను ఆహ్వానించి సన్మానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేశ్ బాబు, హైమావతి, శ్యాంసుందర్, రమాదేవి, సత్యనారాయణ, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

సంస్మరణ సభ

పాతమంచిర్యాల: విప్లవ సాంస్కృతిక రంగ యోధుడు రామారావు 6వ సంస్మరణ సభను జిల్లా కేంద్రంలోని మార్క్స్‌భవన్‌లో ఆదివారం సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ, అరుణోదయ కళాకారులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసు, ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి లాల్‌కుమార్, నాయకులు శ్రీకాంత్, రాజమౌళి, మల్లన్న, సమ్మయ్య, విజయ్, రంజిత్ పాల్గొన్నారు.

వేసవి శిబిరంతో విద్యార్థులకు ప్రయోజనం

నెన్నెల: వేసవి శిబిరంతో విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని నెన్నెల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం వేసవి శిబిరాన్ని ప్రారంభించారు. యోగా, కంప్యూటర్, గేమ్స్ గణితంలో ట్రిక్స్, నృత్యంలాంటి కళలపై శిక్షణ తరగతులు, మోడల్ వాల్యూస్, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను విద్యార్థులకు నేర్పించనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు ప్రదీప్, డాన్స్ మాస్టర్ శ్యామ్ విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కొనసాగుతున్న విద్యుత్ పునరుద్ధరణ పనులు

నెన్నెల: గాలివాన కారణంగా రెండు రోజులుగా అంధకారంలో మగ్గుతున్న కొత్తూర్, చిన్నవెంకటాపూర్ గ్రామాలకు విద్యుత్ అధికారులు విద్యుత్ సరఫరాను శనివారం రాత్రి అందించారు. విద్యుత్ సరఫరా లేక ఇబ్బంది పడుతున్న ప్రజల కష్టాలను పీఏసీఎస్ చైర్మన్ మేకల మల్లేష్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన విద్యుత్ ఏడీ రవికుమార్, డీఈ రాజన్న, ఏఈ ఎస్.రాజన్న సిబ్బందితో కలిసి గ్రామాలను సందర్శించారు. విరిగిపోయిన కరెంట్ స్తంభాల స్థానంలో 20కొత్త పోళ్లను వేసి శనివారం అర్ధరాత్రి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ ఆదర్శ కళాశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ పొందేందుకు ఈ నెల 20లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రామగిరి రమేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయన్నారు.

పోచమ్మకు మొక్కులు

భీమిని: కన్నెపల్లి మండలంలోని ఎల్లారం పోచమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం నైవేద్యం వండి అమ్మవారికి సమర్పించారు. కోళ్లు, మేకలు బలిచ్చి బెల్లం, కల్లు శాఖలతో మొక్కులు చెల్లించుకున్నారు. పోచమ్మ ఆలయం ముందు కొండ రుక్మిణి-మాధవరావు జ్ఞాపకార్థంగా సుమారు రూ.60వేలతో వారి కుటుంబీకులు మిట్ట ఉమరాణి-మనోహర్ దంపతులు షెడ్డు నిర్మించి ఇచ్చారు.

రాష్ట్ర సదస్సులో జిల్లా నాయకులు

మంచిర్యాలటౌన్: టీజీఆర్‌జేఏసీ రాష్ట్రస్థాయి సదస్సును హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించగా, మంచిర్యాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు. జిల్లాకు చెందిన ఉద్యోగుల సమస్యలను ఈ సందర్భంగా సదస్సులో జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి, సెక్రటరీ జనరల్ వనజారెడ్డి రాష్ట్ర నాయకులకు వివరించారు.

పీఎస్సార్‌కు మంత్రి పదవి రావాలని మొక్కులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుకు మంత్రి పదవి రావాలని కోరుతూ మంచిర్యాల రేషన్‌డీలర్లు ఆదివారం తిరుపతిలో ప్రత్యేకంగా మొక్కులు చెల్లించారు. వచ్చే మంత్రివర్గ విస్తరణలో తమ ఎమ్మెల్యేకు మంత్రి పదవి వస్తుందనే ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు బూర్ల మహేందర్, సుదమల్ల కృష్ణ, రామగిరి బానేశ్, బొలిశెట్టి శ్రీధర్, అంకం మనోజ్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ లక్ష్మి మృతి

భీమిని: కన్నెపల్లి మండలంలోని టేకులపల్లి గ్రామ పంచాయతీకి చెందిన మాజీ సర్పంచ్ కొమ్ము లక్ష్మి(37) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. మృతురాలికి భర్త లింగయ్య, ఇద్దరు కుతూళ్లు ఉన్నారు.